క్రీడా స్ఫూర్తిని నింపేలా 'ఆడుదాం ఆంధ్ర'

ఏలూరులో 22 ఆట స్థలాల్లో పోటీలు

ఏలూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నట్టు జిల్లా కలెక్టర్ వె ప్రసన్నవెంకటేష్ అన్నారు. మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 625 సచివాలయాల నుంచి 1, 47 లక్షల మంది ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నగర మేయర్ షేక్ నూర్జాహాన్ మాట్లాడుతూ క్రీడలను అభివృద్ధి చేయాలనే గొప్ప సంకల్పంతో సీఎం జగన్ ఆడుదాం ఆంధ్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్ర నోడల్ ఆఫీసర్ బి.లావణ్యవేణి, జాతీయ క్రీడాకారిణి డి.మాధవి, మాజీ రంజీ ప్లేయర్ ఎస్ఎం రహమాన్ మాట్లాడారు. తొలుత జాతీయజెండా ఎగరేసి, క్రీడాజ్యోతి వెలిగించారు. బెలూన్లు గాల్లోకి వదిలి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు జుజ్జువరపు విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, నగర కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, హౌసింగ్ పీడీ రవికుమార్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

బాలబాలికలు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. తొలుత స్టేడియం పరిసరాల్లోని 10 డివిజన్లకు చెందిన సచివాలయ జట్లకు అధికారులు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో పోటీలు చేపట్టారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీల్లో తలపడ్డారు. నగరంలో 22కు పైగా ఆట స్థలాలను సిద్ధం చేశారు. వీటిలో ఆయా సచివాలయ జట్లకు పోటీలు నిర్వహిస్తున్నారు. 50 డివిజన్‌ల్లో 10 వేలకు పైగా క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరు ఆయా సచివాలయాల జట్లుగా ఏర్పడి పోటీల్లో తలపడుతున్నారు.

చాటపర్రులో ఆడుదాం ఆంధ్ర పోటీలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి కారణంగా క్రీడలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అమ్మ ఒడి, నాడు - నేడు, జగనన్న విద్యా దీవెన, వసతిదీవెన పథకాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు ఖర్చు చేసి పేద విద్యార్థులను ఉన్నత విద్యవైపు నడిపించారని కొనియాడారు. ఇప్పుడు ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆటల పోటీలు చేపట్టి బాలబాలికలను క్రీడాకారులుగా తయారు చేస్తున్నారని వివరించారు. ఇందుకోసం లక్షలాది రూపాయల విలువ గల క్రీడా పరికరాలు అందించడంతోపాటు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందిస్తుండడం సంతోషంగా ఉందని చెప్పారు. యువతీ, యువకులు జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లడుతూ దెందులూరు నియోజకవర్గం ఆటగాళ్లు రాష్ట్ర స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్స్, క్రికెట్, బ్యాడ్మింటన్ బ్యాట్స్, బాల్స్, టెన్నికాయిట్ రింగ్స్ అందజేశారు. తొలుత సర్పంచ్ గుడిపూడి రఘు, ఎంపీడీఓ బి.ప్రణవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఎం సరళ కుమారి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 రంగయ్య, వైసీపీ నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాకలంకలో వాలీబాల్ పోటీలు

కొల్లేరు గ్రామం గుడివాకలంకలో బీసీ కాలనీ ఆట స్థలంలో వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సచివాలయ పరిధిలోని క్రీడాకారులు, బాలబాలికలు పలు జట్లుగా ఏర్పడి పోటీపడ్డారు.


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్


గాలిలో బెలూన్లు వదులుతున్న కలెక్టర్, ఎస్పీ, మేయర్, జేసీ తదితరులు


అంతర్జాతీయ క్రీడాకారిణి మాధవిని సన్మానిస్తున్న అధికారులు


పోటీలకు సిద్ధమైన మహిళా క్రీడాకారులు


పురుషుల విభాగంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


చాటపర్రులో బాలికలకు షటిల్ బ్యాట్లు అందిస్తున్న నాయకులు

క్లుప్తంగా

డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సూర్యప్రకాష్


ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యప్రకాష్

ఏలూరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వైఎస్సార్ సీపీ పోణంగి గ్రామ నాయకుడు గేదెల సూర్యప్రకాష్ నియామకమయ్యారు. మంగళవారం తాడేపల్లి గూడెంలో డీఎల్‌డీఏ చైర్మన్ పసల కనకసుందరరావుతో కలిసి ప్రమాణ స్వీకారం చేసిన విషయాన్ని పోణంగిలో ఆయన వివరించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆశీస్సులతో డీఎల్‌డీఏ సభ్యుడుగా ఎన్నికయ్యానంటూ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యవసాయం, పశుగణన అభివృద్ధి, పాల ఉత్పత్తులతో రైతులు ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని వివరించారు. డీఎల్‌డీఏ మరింత అభివృద్ధి సాధించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సంక్షేమ పథకాలతో సీఎం జగన్, అభివృద్ధి పనులతో ఆళ్ల నాని ఏలూరు నియోజకవర్గ ప్రజల మన్ననలు అందుకున్నారని కొనియాడారు.

నారసింహునిగా జనార్ధన స్వామి


నారసింహావతారంలో జనార్ధన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్ధన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. స్వామి వారికి నారసింహావతార అలంకరణ చేశారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నాగమణి బుద్ధదేవ్‌కు గౌరవ పురస్కారం


నాట్యాచారిణి నాగమణి బుద్ధదేవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య గురువు, శ్రీ నీరజ నృత్య అకాడమీ వ్యవస్థాపకులు నాగమణి బుద్ధదేవ్‌కు బెంగళూరుకు చెందిన కళా సంస్థ శ్రీ రాజరాజేశ్వరి కళానికేతన్ గౌరవ సత్కార పురస్కారానికి ఎంపికైట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కర్ణాటకకు చెందిన సంప్రదాయ నృత్య గురువులైన వీణామూర్తి విజయ్ ఆమె శిష్యురాలు సునీత ఘనిషాలా నవసంధి సంప్రదాయ ఆలయ నృత్య ప్రదర్శనలో భాగంగా అరుదైన గౌరవ సత్కారానికి ఎంపికైనట్టు నీరజ నృత్య అకాడమీ కార్యవర్గం మంగళవారం పేర్కొంది. ఈ పురస్కారాన్ని ఈ నెల 30న బెంగళూరులోని చౌడయ్య మెమోరియల్ హాల్లో నిర్వహించే కార్యక్రమంలో నాగమణి బుద్ధదేవ్‌కు అందించనున్నట్టు తెలిపారు. ఈ పురస్కారానికి ఎంపికైన నాగమణి బుద్ధదేవ్‌ను నగరానికి చెందిన పలువురు నాట్య గురువులు శుభాకాంక్షలు తెలిపారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి


జెడ్పీ సెంటర్‌లోని నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు


వన్‌టౌన్‌లోని రంగా విగ్రహం వద్ద నివాళులర్పించిన కాపు సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): కాపు నేత వంగవీటి రంగా 35వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు కాపు, బహుజన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని రంగా విగ్రహానికి దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రంగా కేవలం కాపులకే నాయకుడు కాదని ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆరాధ్యుడని వివరించారు. కాపులతో పాటు అట్టగు వర్గాల ప్రజలకు వెన్నుదన్నుగా రంగా ఉండేవారని గుర్తుచేశారు. 1989లో టీడీపీ అధికారంలో ఉండగా ఆయన్ని అతి దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నూకపెయ్యి కార్తీక్, సూర్యనారాయణ మాస్టారు, జొన్నాదుల పోసిరాజు, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో సీఆర్ఆర్ కళాశాల సెంటర్, జెడ్పీ సెంటర్, మెయిన్ బజారు సెంటర్లలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మోటేపల్లి చంద్రశేఖర్, పులి శ్రీరాములు, వాసా రాజు, తన్నీరు బుజ్జి, సామర్ల వెంకటేశ్వరరావు, వంగల శివ, కురెళ్ల భాస్కరరావు, పాలేటి భాస్కరావు, తోట శ్రీనివాస్, కూనిశెట్టి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కన్నయ్య పార్కు సెంటర్లో ఉన్న రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెదబాబు

అందరివాడు వంగవీటి రంగా

ఏలూరు (టూటౌన్): కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరూ అభిమానించే గొప్ప వ్యక్తి వంగవీటి మోహన రంగ అని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్థానిక మెయిన్ బజారులోని కన్నయ్య పార్కు సెంటర్లోని రంగా విగ్రహం వద్ద మంగళవారం ఆయన 35వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. రంగా ప్రజల మధ్యలో లేనప్పటికీ ఎందరో రాజకీయ నాయకులు ఆయన అనుసరించిన బాటలో నడుస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంకదారు ప్రవీణ్, సబ్బన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ లీడర్ మధ్యాహ్నపు ప్రభాకర్, విగ్రహ నిర్మాణ కర్త సుధాబత్తుల రాజేష్, కిరణ్, కాపునాడు అధ్యక్షుడు జిల్లా హరికృష్ణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఇడా చైర్మన్ శ్రీనివాస్, కార్పొరేటర్ అఖిల

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అభివృద్ధి పనులను వేగంగా చేపట్టేందుకు ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చర్యలు చేపట్టారని, తాజాగా ఏలూరు 3వ డివిజన్ మారుతీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కార్పొరేటర్ బొద్దాని అఖిల తెలిపారు. మారుతీనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు మంగళవారం వారు శంకుస్థాపన చేశారు. ఏలూరు నగరంలో వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇడా ఆధ్వర్యంలో నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మేతర సురేష్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత జూలై నెల నుంచి నూతన పీఆర్సీ అమలుకు వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ సబ్ కమిటీ సమావేశం స్థానిక ఇష్టా కార్యాలయంలో రామారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఏపీటీఎఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా పనిచేసిన పురేటి వెంకటరత్నంలకు సమావేశం సంతాపం ప్రకటించింది. రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడారు. జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే రంగావలి, జిల్లా శాఖ సబ్ కమిటీ సభ్యులు జేఎస్ శాస్త్రి, ఎస్ దొరబాబు, కేఎస్ రమాదేవి, డికేఎస్ఎస్ ప్రకాశరావు, రాష్ట్ర కౌన్సిలర్లు కుటుంబరావు ఆడిట్ కమిటీ సభ్యులు టి.ప్రకాష్, ఇ.జగదీష్, ఏలూరు నగర శాఖ అధ్యక్షులు ఆనంద్ ఏలూరు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రామశేష్, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలు ధైర్యసాహసాలతో ఉండాలి


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఎటువంటి సమస్యలు ఎదురైనా ధైర్య సాహసాలతో ఎదుర్కోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ బాలలకు సూచించారు. వీర్ బాల దివాస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పోణంగి రోడ్డులోని రాజరాజేశ్వరి కాలనీ నందలి శ్రీరవితేజ ఎడ్యుకేషన్ సొసైటీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1704 సంవత్సరంలో తొమ్మిదేళ్ల జోరా వార సింగ్, ఏడేళ్ల ఫతే సింగ్‌లను మొగలాయిలు మతమార్పిడి చేసుకోవాలంటూ హింసించడంతో వారు బలిదానం చేసుకున్నారని తెలిపారు. వారిని స్మరించుకుంటూ డిసెంబరు 26ను బాల దివాస్ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఐసీడీఎస్ సాధికారత అధికారి కేవీఎల్ పద్మావతి మాట్లాడుతూ వీర బాల దివాస్‌లో భాగంగా బాలలందరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెంపొందిచుకొని ముందుకు సాగాలన్నారు. బాలల హక్కులను పొందుతూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ బాలలు వివక్షతకు, అణచివేతకు గురికావడం, ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు బాలల హక్కుల్లో ఒకటైన రక్షణ పొందే హక్కు ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ నోడల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సూర్యచక్రవేణి, శ్రీ రవితేజ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ ఎ.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ రాజేష్, సీహెచ్ శ్రీకాంత్, వైవీ రాజు, సునీత, కె.భార్గవి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఇడా చైర్మన్


కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇడా చైర్మన్ శ్రీనివాస్

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా ఇడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొద్దాని శ్రీనివాస్ మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విజయేంద్రరావు కుటుంబానికి ఆర్థిక సాయం

దెందులూరు: పోతునూరులో ఇటీవల మృతి చెందిన మద్దా భుజంగరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ రమాదేవి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాసే డొమినిక్, డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, బుద్దా అర్జున, రమేష్ తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: పోతునూరు, కొవ్వలి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పోతునూరులో కాళి ప్రసాద్, లింగాల ధర్మారావు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కొవ్వలిలో వెలమాటి మోహనకృష్ణ భార్య ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సర్పంచ్ ఇంటేటి మధులత, కొమ్మిన రాము, రంగారావు, వాసే డొమినిక్ పాల్గొన్నారు.

శక్తి కేంద్రాల పాత్ర కీలకం

ఏలూరు (టూటౌన్): బీజేపీ బలోపేతంలో శక్తి కేంద్రాల పాత్ర కీలకమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ గాది రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన శక్తి కేంద్రాల ప్రముఖుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

సమ్మె చేపట్టిన కార్మికులు

రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పనిముట్లతో ప్రదర్శన నిర్వహించారు.

ప్రజా సమస్యలపై తీర్మానాలకు ఆమోదం

సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఏలూరులో నిర్వహించారు. పలు ప్రజాసమస్యలపై తీర్మానాలను ఆమోదించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం

సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం స్థానిక 15, 36, 45వ డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ పతాకాలను ఆవిష్కరించారు. సీపీఐ నిర్వహించిన ఉద్యమాలను సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ వద్ద దీక్ష

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేయనున్నట్టు ఏపీ గ్రామ రెవెన్యూ అసోసియేషన్ (వీఆర్ఏ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్ లింగరాజు, జిల్లా అధ్యక్షులు బ్రహ్మాజీ, కార్యదర్శి చంద్ర శేఖర్, కోశాధికారి గంగాధర్‌లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	13
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	20
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	33